# మన్యంలో వైద్యం అధ్వానం

## ● సీహెచ్‌సీ సందర్శించిన బాబు

పాడేరు పట్టణం, జూన్ 28 (న్యూస్‌టుడే): మన్యంలో గిరిజనులకు సర్కారు వైద్యం అందని ద్రాక్షగా మిగిలిందని తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. గిరిజన ప్రాంతంలోని ఆరోగ్య కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు సైతం కరువై దీనావస్థలో రోగులు కొట్టుమిట్టాడుతున్నా కాంగ్రెస్ సర్కారుకు చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. 'మీ కోసం' యాత్రలో భాగంగా శనివారం ఇక్కడ పర్యటించిన చంద్రబాబు రోడ్‌షో అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. వార్డుల్లో తిరిగి జ్వరాలతో బాధపడుతున్న రోగుల్ని పరామర్శించారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం దినసరి రోగుల నమోదు పుస్తకాన్ని పరిశీలించారు. డివిజన్ కేంద్రంలో ఆరోగ్య కేంద్రంలోనే వైద్య సేవలు అందించేందుకు వైద్యులు లేక పోవటంతో ఆయన విస్మయం చెందారు. గతేడాది ఒక్క విశాఖ ఏజెన్సీ లోనే వేలాది మంది గిరిజనులు జ్వరాల బారినపడి మరణిస్తే సాధారణ మరణాలుగా పాలకులు సృష్టించారని ఆయన మండిపడ్డారు. తెదేపా అధికారంలోకి వస్తే పాడేరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల స్థాయికి పెంచుతామని హామీ ఇచ్చారు. ఏజెన్సీలో ప్రత్యేకంగా అత్యవసర వైద్య విభాగాన్ని ఏర్పాటు చేసి వ్యాధులు నివారణకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు బండారు సత్యనారాయణమూర్తి, మాజీమంత్రి మణికుమారి, నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ కొట్టగుళ్లి చిట్టినాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, జిల్లా ప్రచార కార్యదర్శి పీవీజీ కుమార్, మండలాధ్యక్షుడు బి.నాగరాజు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న బాబు

### వైద్య శిబిరం సందర్శన

మండలంలో నక్కలపుట్టు గ్రామంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని చంద్రబాబు సందర్శించారు. లాభాపేక్ష లేకుండా గిరిజన ప్రాంతంలో అంధులకు అనాథలకు వైద్యసేవలు అందిస్తున్న నిర్వాహకులకు ఆయన అభినందించారు. రోగులకు కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు.